క్లుప్తంగా

వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి


ఉదయ్‌కుమార్‌రెడ్డి

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా జీవై.వెంకట సుబ్బారెడ్డి అలియాస్ ఉదయ్‌కుమార్ నియమిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ చైర్మన్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సర్పంచి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి హాజరుకానున్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం


విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్

చాపాడు : విద్యార్థులు, యువకులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమిరుద్దీన్ అన్నారు. చాపాడులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. అమీరుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు డీఏ మంజూరు


అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాగేశం

అట్లూరు : వీఆర్‌ఏలకు రూ.500 డీఏ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కరవు భత్యం కింద వీఆర్‌ఏలకు రూ.1000 డీఏ చెల్లించాలని మంగళగిరిలోని సీసీఎల్‌ఏ చీఫ్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారన్నారు. ప్రభుత్వం స్పందించి సానుకూలంగా రూ.500 డీఏ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పింఛనర్ల భవనం ప్రారంభం


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : శ్రీరామచంద్ర రిక్రియేషన్ క్లబ్‌కు పూర్వ వైభవం రావాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. క్లబ్ ఆవరణలో నిర్మించిన పింఛనర్ల సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు విస్తరణలో క్లబ్ ఎదుట స్థలం పోవడంతో భవనం కొంత దెబ్బతిందని, దీంతో త్వరితంగా భవన నిర్మాణం చేపట్టారన్నారు. అనంతరం భవన నిర్మాణానికి కృషి చేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, సీఎం.బాషా, డీసీ ఆదిత్యారెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన


కళాజాత బృందం ప్రదర్శన

పోరుమామిళ్ల : జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ఆదివారం పోరుమామిళ్లలో కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. జయశంకర్ బృందం సభ్యులు హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు, వివక్ష ఉండరాదని ప్రజలకు వివరించారు. ప్రదర్శనలో ఐసీటీసీ శ్రీవాణి, ఎల్‌టీ సుధాకర్, అశోక్‌కుమార్, సుధీర్, నరేంద్ర పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం అభయాంజనేయస్వామివిగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదానంఉంటుందన్నారు.

రూ.2.5 కోట్లతో రహదారి

- 10 గ్రామాలకు తీరిన రవాణా సమస్య
- ప్రారంభించిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


బీటీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

మైదుకూరు : జీవీ సత్రం నుంచి మిట్టమానుపల్లె వరకు రూ.2.5 కోట్లతో రహదారి నిర్మాణం జరగడంతో పది గ్రామాలకు రవాణా సమస్య తీరిందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో కలిసి రోడ్డును ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అదే సమయంలో మైదుకూరు డిపో నుంచి జీవీ సత్రం మీదుగా బ్రహ్మంగారిమఠం వరకు నూతన బస్సు సర్వీసును వేసిన కొత్త బస్సు సర్వీసును వెంటనే వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పది గ్రామాల ప్రజలకు సరైన రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని, రోడ్డు నిర్మాణంతో సమస్య తీరిందని తెలిపారు. గంగాయపల్లె వద్ద నుంచి మిట్టమానుపల్లె సమీపంలోని బ్రహ్మంగారిమఠం రోడ్డు వరకు రూ.2.50 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ బీటీ రోడ్డు నిర్మించిందన్నారు. బస్సు సౌకర్యం కల్పించడంతో మైదుకూరు– బద్వేలు రహదారిలోని గడ్డంవారిపల్లె, పెద్దశెట్టిపల్లె, జీవీ సత్రం, శ్రీరామ్‌నగర్, లక్ష్మీనారాయణపురం, ఉప్పుగుంటపల్లె, సుంకులుగారిపల్లె, మాచుగారిపల్లె, కరజగిరి, మిట్టమానుపల్లె గ్రామాలకు అటు బ్రహ్మంగారిమఠం వెళ్లేందుకు, ఇటు మండల కేంద్రం మైదుకూరు చేరుకునేందుకు రవాణా సమస్య తీరిపోయిందన్నారు. రైతులు తమ ఫలసాయాన్ని జీవీ సత్రంలోని మార్కెట్‌కు తరలించేందుకు తోడ్పడుతుందన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కృషితో రోడ్డు సౌకర్యం ఏర్పడటంతో బస్సు సర్వీసును ప్రారంభించామని, రోజూ ఉదయం, సాయంత్రం రెండు సార్లు బస్సు తిరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూలె సుధాకర్‌రెడ్డి, గల్లా నరసింమారెడ్డి, బొర్రా సాంబశివారెడ్డి, రాజోలి రామ మోహన్‌రెడ్డి, కానాల చిన్న గోవిందరెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, బాలవెంకటరెడ్డి, ఎర్రపురెడ్డి పుల్లారెడ్డి, రాజోలి వీరరాఘవరెడ్డి, వీరారెడ్డి, నారిబోయిన నారాయణ, పేరగాని చిన్న సుబ్బరాయుడు, అన్నయ్య, అయ్యల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శుద్ధజలం

మొర్రాయిపల్లెలో కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే, అటవీశాఖ చైర్మన్


శుద్ధజల యంత్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అటవీశాఖ కార్పోరేషన్ చైర్మన్

చాపాడు : గ్రామ ప్రజలంతా శుద్ధజలం సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని మొర్రాయిపల్లెలో నూతనంగా ఏర్పాటుచేసిన శుద్ధజల యంత్రాన్ని రాష్ట్ర అటవీ శాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అందరూ వినియోగించుకోవాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు సూచించామన్నారు. అనంతరం అటవీ శాఖ క్యాలెండర్, డైరీలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచి రామాంజనేయులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీ రమణరెడ్డి, జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, నారాయణ రెడ్డి, నగర్తి ప్రసాద్, జయసుబ్బారెడ్డి, మహేష్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, బాల వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాత సాయంతో మైదానం బాగు


క్రికెట్ కిట్‌ను పంపిణీ చేస్తున్న కొండారెడ్డి

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆట స్థలం రూపురేఖలు మారిపోయాయి. గ్రామానికి చెందిన దాత కొండారెడ్డి తన సొంత ఖర్చుతో బాగు చేయించారు. గతంలో ఈ స్థలంలో కంపచెట్లు విస్తరించి కాలు మోపేందుకు వీలు లేకుండా ఉండేది. యువకులు ఆటలాడుకునేందుకు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని కొండారెడ్డి దృష్టికి యువకులు తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకుని మైదానాన్ని సొంత ఖర్చుతో బాగు చేయించారు. కొండారెడ్డి మాట్లాడుతూ ఈ గ్రౌండ్‌లో త్వరలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను పంపిణీ చేశారు.

ఎన్‌బీఏ బృందం తనిఖీ


మెకానికల్ విభాగాన్ని తనిఖీ చేస్తున్న ఎన్‌బీఏ చైర్మన్ డాక్టర్ రాజీవ్

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానిక్ విభాగాన్ని నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) బృందం సభ్యుల తనిఖీలు ఆదివారం ముగిశాయి. కళాశాలలో జరిగిన సమావేశంలో ఎన్‌బీఏ చైర్మన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ మెకానికల్ విభాగంలో పది విభాగాలను తనిఖీ చేయగా 9 విభాగాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్ విషయంలో కళాశాల పురోగతి సాధించాలని తెలిపారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలతో కళాశాల సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వరుడు మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, రాయితీలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఏ బృందం సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ ఆలీ, అశోక్ బాబు, కాశిరెడ్డి శ్రావణ్, సురేష్ బాబు, రాజేష్, హరీష్, మురళీ, సునీత, సువర్ణ, జీవరాజ్‌పాల్, వరప్రకాష్ పాల్గొన్నారు.

సీఐ ఇబ్రహీం పనితీరు భేష్


సీఐ ఇబ్రహీంను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐలు

ప్రొద్దుటూరు క్రైం : సీఐ ఇబ్రహీం పనితీరు భేష్ అని డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. సీఐ ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా పనిచేస్తున్న ఇబ్రహీం కడప టూటౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో పోలీసు అధికారులు ఆత్మీయ సన్మానం, వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సీఐ ఇబ్రహీం మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు, ప్రజల సహకారంతో చక్కగా పనిచేశానన్నారు. ప్రొద్దుటూరు ప్రజల అభిమానం మరువలేనిదని, ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు. అనంతరం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

రూ.లక్ష ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న రాజనారాయణరెడ్డి

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట గ్రామానికి చెందిన క్లాస్–1 కాంట్రాక్టర్ బుసిరెడ్డి రాజనారాయణరెడ్డి నిరుపేదలైన ఓబుళాపురం గ్రామానికి చెందిన బండిజేమ్స్‌కు రూ.60 వేలు, చెన్నారెడ్డిపల్లెకు చెందిన ఓబుళాపురం శశికళకు రూ.40 వేలు ఆదివారం ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి సాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీరారెడ్డి, వెంకటరామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చక్రస్నానం.. సర్వపాపహరణం


స్నపన తిరుమంజనంలో శ్రీవెంకటరమణస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో చివరిఘట్టమైన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఉన్న కొలనులో చక్రస్నానం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్నపన తిరుమంజనాన్ని ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకించి తిరుమల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీగంధం, కుంకుమ పువ్వులేపనంతో అలంకరించారు. తులసిమాల, సుగంధ వట్టివేరు మాలలతో అలంకరించి మంగళ స్నానాలు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవిందా..గోవిందా అంటూ దేవదేవున్ని వేడుకున్నారు. మహా మంగళహారతులు పట్టారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు కూడా ఆకొలనులో మునిగితేలారు. సాయంత్రం యాగశాలలో కలశారాధన ప్రధాన నిత్య హోమాలు, విశేష హోమాలు చేసి పూర్ణాహుతి చేపట్టారు. ధ్వజావరోహణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

చర్చి నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, సంఘ పెద్దలు, గ్రామస్తులు

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురం పంచాయతీ మూలవారిపల్లెలో చర్చి నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. తాళ్లమాపురం పంచాయతీ సర్పంచి మాచిరెడ్డి కొండారెడ్డి, ఉపసర్పంచి మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీరారెడ్డి, జేష్టాది భాస్కర్, మూలవారిపల్లె గ్రామ చర్చి సంఘ పెద్దలు ఎమ్మెల్యేను కలిసి ఆదివారం చర్చి నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీంతో రూ.10 లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సి.రాజు, ఎం.చిన్నబాబు, జె.రవి, ఎ.రమేష్, కనకరాజు, చంటి, ఓబులేసు, ప్రతాప్, పాస్టర్ సునీల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే వైజ్ఞానిక ప్రగతి

ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి


విజేతలతో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, సీవీ రామన్ సైన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు నూతన ఆవిష్కరణలతోనే వైజ్ఞానిక ప్రగతి పరుగు తీస్తుందని ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని, వారి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. సీవీ రామన్ సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ కేవీ.విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన పరీక్షకు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు మాధ్యమంలో శ్రీలేఖ, రోషిణి, కీర్తనలకు, ఆంగ్ల మాధ్యమంలో సాయిభవిత, మనోజ్‌కుమార్, దేవంత్‌రెడ్డిలు వరుస విజేతలుగా నిలవగా వారికి నగదు బహుమతి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అతిథులు కాంట్రాక్టర్ కృష్ణార్జునరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, వాణి, శేషశర్మ, రమణమహర్షి పాఠశాల పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రమ్మ, మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, గోపీనాథరెడ్డి, రవిప్రకాష్, కళ్యాణ్‌కుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.

నూతన కమిటీ

సీవీ రామన్ సైన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడిగా చాపాడు మండల ఎంఈఓ–2 వడ్ల వంశీ, కార్యదర్శిగా రాజుపాళెం మండలం వెలవలి జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు అల్లాబకాష్ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు జన నీరాజనం

9వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


ప్రచారంలో భాగంగా బాలికతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి వార్డు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే 9వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లుకు ప్రతి ఇంటి వద్ద పూల దండలు వేయడంతోపాటు అడుగడుగునా ఆయనపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి మేలు జరిగితేనే ఓటు వేయాలన్నారు. ప్రతి ఇంటికి జగనన్న సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. 9వ వార్డుకు సంబంధించి రూ. 14.26 కోట్లకు పైగా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. వార్డులోని పాఠశాలల రూపు రేఖలను మార్చామని, అన్ని ప్రాంతాల్లోనూ సిమెంట్ రోడ్లను కూడా వేసినట్లు చెప్పారు. తనకు వృద్ధాప్య ఫించన్ రావడం లేదని గంజికుంట బాలవీరమ్మ అనే వృద్ధురాలు ఎమ్మెల్యే రాచమల్లు దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆమెకు ఇప్పుడు రూ. 30 వేలు అందచేయడంతో పాటు ఫించన్ మంజూరయ్యే వరకు ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తానని చెప్పారు. ఎంబీఏ చదువుతున్న దరూబాయిగారి ఆసిఫా అనే విద్యార్థినికి కాలేజీలో ఉన్న తన సర్టిఫికెట్లను తెచ్చుకునేందుకు రూ. 30 వేలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచి చేస్తే ప్రజలు ఆదరిస్తారనడానికి 9వ వార్డులో జరిగిన ప్రచారమే నిదర్శనమన్నారు. తన ప్రచారం సందర్భంగా వార్డు ప్రజలు చాలా మంది బంధువులను పిలుచుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్ప వేరే వాళ్లకు ఓటు వేసే ప్రసక్తే లేదని ప్రజలు చెబుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సత్యం, 14వ వార్డు కౌన్సిలర్ జిలాన్, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


వినాయకనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ


బలిజవీధిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కలసపాడులోని వినాయక్‌నగర్, రైల్‌మిల్‌వీధి, కొత్తకొట్టాల, బలిజవీధి, కుమ్మరవీధిలలో ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలుసుకోవడంతోపాటు, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హత ఉంటే చాలు పథకాలను అందిస్తున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం పాటుపడుతుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఎంత మంది జతకట్టి వచ్చినా తమ పార్టీ విజయాన్ని ఆపలేరన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్, పులివీరారెడ్డి, మోహన్‌రెడ్డి, మలిపెద్దు నాగరాజ, కొండాదామోదర్‌రెడ్డి, గుండంసుధాకర్‌రెడ్డి, రాంబాబు, కాతాసుబ్బారెడ్డి, మహబూబ్‌బాష, థామస్, సింగరయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన : ఈ నెల 28న ఉదయం 10–30 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, ఉపాధి, విద్య, వైద్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు బ్రాహ్మణపల్లెకు ఎమ్మెల్యే రాక

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లెకు ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రచారం ఉంటుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

– రేపు రంగనాథుని కల్యాణం



పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు సతీసమేతుడై హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. సాయంత్రం పట్టణ పురవీధులలో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా ఊరేగారు. ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామి వారు తమ ఇంటి ముందుకు రాగానే భక్తులు చదుర్లు(ప్రత్యేక పూజలు) నిర్వహించారు. కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజు మంగళవారం ఉదయం శ్రీరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.